సాక్షి
కాకినాడ

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



శ్రద్ధ చూపితే మార్కుల యోగమే..

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అత్యంత కీలకం. ఇక్కడ సాధించే మార్కులే పైచదువులకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ మార్కులు ఎంతో ప్రాధాన్యమైనవి.

8లో



బాధితుడే ప్రధాన సూత్రధారి

మృతదేహం దహనం కేసులో బాధితుడిగా భావించిన కేతమల్ల వెంకటేశ్వరరావే అసలు సూత్రధారి అని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ కె.కిశోర్ కుమార్ తెలిపారు.

10,950 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,950 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి
– జేసీ ప్రవీణ్ ఆదిత్య



కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాకినాడ సిటీ: జిల్లా ప్రజలు, అధికారుల సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ (జేసీ) సి.ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ ఆదిత్యను డీఆర్వో కె.శ్రీరమణి, పౌరసరఫరాల డీఎం డి.పుష్పమణి, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, సర్వే శాఖ ఏడీ బి.లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గతనెల 29న ఇచ్చిన జీఓలో మార్పులు చేస్తూ కొత్తగా జీఓ విడుదల చేసింది. తొలుత ఏపీఎస్పీ కమాండెంట్‌గా పనిచేస్తున్న విజయరావును కర్నూలు రేంజ్ డీఐజీగా మార్పు చేసి ఆయన స్థానంలో కృష్ణకాంత్ పటేల్‌ను నియమించింది. మార్పుల అనంతరం కృష్ణకాంత్ పటేల్ స్థానంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు కమాండెంట్‌గా ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించింది.

జిల్లాకు ఇద్దరు అదనపు ఎస్పీలు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాకు ఇద్దరు అదనపు ఎస్పీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం జీవో విడుదల చేసింది. కొద్ది రోజుల క్రితం పదోన్నతిపై బదిలీ అయిన శ్రీనివాస్ స్థానంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా కొనసాగుతున్న ఎంవీవీ భాస్కరరావును, సెబ్ అదనపు ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రేమ్ కాజల్ స్థానంలో చిత్తూరు సెబ్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శ్రీ లక్ష్మిని ప్రభుత్వం నియమించింది.

వీధి బాలల రక్షణకు ప్రాధాన్యం

కాకినాడ రూరల్: వీధి బాలల రక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. అంతర్జాతీయ వీధి బాలల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేక అనాథల్లా వీధుల్లో తిరుగుతున్న బాలలను గుర్తించి, వారికి పునరావాసం కల్పించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్టు తెలిపారు. వీధి బాలల గుర్తింపునకు గాను పోలీసు శాఖతో పాటు తమ సంస్థ నిరంతరం అన్వేషణ చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. చిన్నతనంలోనే వీధి బాలలను గుర్తించి సరైన మార్గంలో పెట్టకపోతే వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అడబాల రత్నప్రసాద్, శ్రీనివాసరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి

కాకినాడ సిటీ: 18–19 వయసు యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఇంకా ఓటర్లుగా నమోదు కాని 18–19 మధ్య వయసున్న వారికి అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. డీఆర్వో కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, జి.సాయిబాబా, పెద్దిరెడ్డి రవికిరణ్, సబ్బారపు అప్పారావు, కాళ్లూరి కృష్ణమోహన్, ఆకుల వెంకటరమణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.





ఇంగ్లిష్ అధ్యాపకురాలు పి.జయకు పీహెచ్‌డీ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వీసీ ప్రసాదరాజు, వర్సిటీ ప్రగతి వివరిస్తున్న వీసీ ప్రసాదరాజు

అట్టహాసంగా పట్టాల పండగ

- ఘనంగా జేఎన్‌టీయూకే 10వ స్నాతకోత్సవం
- కులపతి హోదాలో హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్
- బంగారు పతకాలు, పట్టాల ప్రదానం



సీఎస్ఈ టాపర్ ఎన్.శివపార్వతి శ్రీవాణి సాగరికు బంగారు పతకం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జేఎన్‌టీయూలో బుధవారం పదవ స్నాతకోత్సవం వర్సిటీ ఆవరణలో అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల మధ్య అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. 15 సంవత్సరాల చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ కాకినాడ ప్రాంగణం ఇందుకు వేదికగా నిలిచింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరయ్యారు. దీంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరిమిత సంఖ్యలో ఆహుతులతో కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది మే 31న వర్సిటీ 9వ స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకాగా మళ్లీ ఇప్పుడు ఎనిమిది నెలల కాలంలో రెండవ సారి వచ్చారు. బంగారు పతకాలు, పీహెచ్‌డీలు పొందేవారు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనడంతో ఆడిటోరియం కొత్త శోభను సంతరించుకుంది. వీసీ ప్రసాదరాజు గౌరవ డాక్టరేట్ టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. గంటా ఐదు నిమిషాల పాటు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సందడి చేశారు.

ప్రగతి వివరించిన వీసీ...

ఆడిటోరియంలోకి పరిమిత సంఖ్యలో జనాన్ని అనుమతించగా బయట ప్రత్యేకంగా ఎల్‌సీడీలు ఏర్పాటు చేసి లైవ్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత పతకాలు, పట్టాల గ్రహీతలతో వీసీ ప్రసాదరాజు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గవర్నర్ అనుమతితో కార్యక్రమం ప్రారంభించారు. వీసీ ప్రసాదరాజు తన ప్రసంగంలో వర్సిటీ సాధించిన ప్రగతి వివరించారు. చేపట్టిన పనులు, చేపడుతున్న అభివృద్ధి గురించి తెలియజేశారు. కళాశాలలో చదివిన కొందరు కలెక్టర్లుగా ఎంపికై ఉన్నత స్థాయిలో ఉన్నారని, అత్యధికంగా రూ.33 లక్షల ప్యాకేజీతో ఇటీవల సాఫ్ట్‌వేర్ సంస్థలో ఒకరు ఉద్యోగం సాధించారన్నారు.

అంతర్జాతీయంగా వర్సిటీకి గుర్తింపు..

దాదాపు 20 నిముషాల పాటు గవర్నర్ ప్రసంగించారు. వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ప్రేరణ కలిగించేలా ఆయన ప్రసంగం సాగింది. అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా జేఎన్‌టీయూ కాకినాడ స్థిరపడిందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడంలో దేశంలో యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందన్నారు.

నైపుణ్యాలు ఒడిసి పట్టాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు ఒడిసి పట్టాలని ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ నేవీ అధికారి ఎస్.వెంకట శేషాచారి సూచించారు. ముఖ్యంగా ఫైనాన్స్, లాజిటిక్స్, మానవ వనరుల నిర్వహణ, విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే పరిశ్రమల కోసం ఆర్‌అండ్‌డీ ప్రాజెక్టులు ప్రోత్సహించాలన్నారు. యువత ఉద్యోగం కోసమే కాకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఆలోచించాలని కోరారు. అనంతరం గవర్నర్ చేతుల మీదుగా ఏడుగురు విద్యార్థులకు బంగారు పతకాలు, ఇద్దరికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు.

న్యాక్ ఏప్లస్ గుర్తింపు పొంది మరింత ఖ్యాతి..

న్యాక్ ఏప్లస్ గుర్తింపుతో వర్సిటీకి మరింత ఖ్యాతి వచ్చిందని వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. గ్రాడ్యుయేషన్ డే అంటే యూనివర్సిటీతో సంబంధం ముగించడం కాదని, కేవలం ఇంటర్నల్ స్టూడెంట్‌గా యూనివర్సిటీని విడిచిపెట్టి ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నారన్నారు. శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని అధ్యయనం చేస్తే ఇంజినీర్లు ప్రపంచాన్ని సృష్టిస్తారన్నారు.

సైన్స్ రంగంలో పీహెచ్‌డీలు పొందిన వారి సంఖ్యలో యూఎస్, చైనా తరువాత మూడవ స్థానం భారతదేశం సాధించిందని, స్టార్టప్‌ల సంఖ్యపరంగా కూడా 3వ స్థానంలో ఉన్నామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు, నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ వీసీలు తులసీరామ్‌దాస్, వీఎస్ఎస్ కుమార్, పాలక మండలి సభ్యులు, డైరెక్టర్లు, పాల్గొన్నారు.

2019–23కు సంబంధించి 10వ స్నాతకోత్సవంలో వర్సిటీ అందజేసిన పట్టాలు

బీటెక్ .. 34,199, బీ ఫార్మసీ 1477, బీఆర్క్ 13, ఎంసీఏ 343, ఎంబీఏ 1,093, ఎంటెక్ 1,689, ఎం.ఫార్మసీ 332, బీబీఏ 21, ఫార్మా–డీ 182, పీహెచ్‌డీ 64, బంగారు పతకాలు 28

అలా మొదలై.. ఇలా ముగిసింది

షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభం కావలసి ఉండగా 11.22 గంటలకు మొదలైంది. 11 గంటలకు వర్సిటీకి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేరుకున్నారు. యూనివర్సిటీ డైరెక్టర్లు ఒక్కొక్కరిని వీసీ ప్రసాదరాజు గవర్నర్‌కు పరిచయం చేసి గ్రూప్ ఫొటో సెషన్ అనంతరం వేదికపైగా తీసుకెళ్లారు.

- 11.22 గంటలకు గవర్నర్ అనుమతితో కార్యక్రమం ప్రారంభం
- 11.32 పీహెచ్‌డీ, గోల్డ్‌మెడల్ విజేతలతో ప్రతిజ్ఞ
- 11.37 గవర్నర్ అనుమతితో రాజన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 11.42 ఇద్దరికి పీహెచ్‌డీలు, 7గురికి బంగారు పతకాలు ప్రదానం
- 11.45 ముఖ్య అతిథి శేషాచారి ప్రసంగం
- 11.55 గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం
- 12.17 గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీసీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో సత్కారం
- 12.18 రెక్టార్ కేవీ రమణ ధన్యవాదాలు, జాతీయ గీతంతో ముగింపు



సత్యదేవుని హుండీ రాబడి రూ.1.70 కోట్లు

రికార్డు స్థాయిలో 36 రోజుల ఆదాయం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా గత 36 రోజులకు రికార్డు స్థాయిలో రూ.1,70,15,123 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను బుధవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,64,24,791 కాగా, చిల్లర నాణేలు రూ.5,90,332 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె. రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోబాటు బంగారం 40 గ్రాములు, వెండి 1,020 గ్రాములు వచ్చింది.

అన్‌సీజన్ అయినప్పటికీ..

సాధారణంగా కార్తికమాసం అనంతరం మార్గశిరం, పుష్య మాసాలు అన్ సీజన్‌గా భావిస్తారు. వివాహాలు జరగవు. భక్తులు కూడా అంతగా రారు. ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రమే వస్తారు. అయినప్పటికీ ఈసారి హుండీ ఆదాయం బాగా వచ్చింది. కార్తికమాసం అనంతరం డిసెంబర్ 26న హుండీ ఆదాయం లెక్కించారు. ఈ 36 రోజుల్లో మార్గశిర మాసం 15 రోజులు, పుష్యమాసం 21 రోజులు ఉన్నాయి. అయితే గత సంక్రాంతి సెలవుల్లో సత్యదేవుని సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయడం, సాధారణ రోజుల్లో కూడా రోజుకు కనీసం 30 వేలకు తగ్గకుండా భక్తులు రావడంతో అధిక మొత్తంలో ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



హుండీలలో వచ్చిన నగదును కట్టలు కడుతున్న ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది

హుండీల ద్వారా విదేశీ కరెన్సీ ...

సత్యదేవుని హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికా డాలర్లు 291, సింగపూర్ డాలర్లు 26, యుఏఈ దీరామ్స్ 30, కెనడా డాలర్లు 50, సౌదీ అరేబియా రియల్స్ 212, జపాన్ యన్స్ వేయి లభించాయి. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బందితో బాటు పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు. హుండీలలో వచ్చిన నగదును స్టేట్‌బ్యాంకుకు తరలించారు.

అన్నవరం దేవస్థానానికి 'ఆరెంపూడి సత్రం' దత్తత



పాత 'కిర్లంపూడి వారి ఆరెంపూడి సత్రం'

సత్రానికి 103 ఎకరాల భూమి, రూ.కోట్ల విలువ చేసే స్థలాలు, భవనం

అన్నవరం: స్థానిక 'కిర్లంపూడి వారి ఆరెంపూడి సత్రం'ను ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి దత్తత ఇస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సత్రం ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల దేవస్థానం (చిన్న తిరుపతి) దత్తతలో ఉంది. అయితే తమకు దత్తత ఇచ్చిన సమయం అయిపోయినందున ఈ సత్రాన్ని తమ దేవస్థానం నుంచి ఉపసంహరించాలని ద్వారకాతిరుమల దేవస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ సత్రం అభివృద్ధికి తమ దేవస్థానం నుంచి రూ.81లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొంది. దాంతో ఈ సత్రాన్ని అన్నవరం దేవస్థానానికి దత్తత ఇస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అన్నవరంలో పోలీస్ స్టేషన్ వెనుక సుమారు ఎకరం స్థలంలో గల ఈ సత్రంలో భక్తుల వసతికి 12 గదులున్నాయి. వాటిలో రెండు గదులు ఏసీ. వీటిని భక్తులకు అద్దెకు ఇస్తున్నారు. ఈ సత్రానికి ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామ పరిధిలో 103.62 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ద్వారా సుమారు రూ.25 లక్షల కౌలు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. అన్నవరంలో ఉన్న సత్రం భవనం, స్థలాలు రూ.కోట్లు విలువ కలిగినవి.

సత్రం చరిత్ర...

బాటసారులకు వసతి, భోజన సౌకర్యం కల్పించే ఉద్దేశంతో అన్నవరంలో పాతబస్టాండ్ వెనుక రెండు ఎకరాల సువిశాల ప్రదేశంలో 150 సంవత్సరాల క్రితం శ్రీ రాజా ఇనుగంటి రాజగోపాల వెంకట నరసింహరాయణం కిర్లంపూడి వారి ఆరెంపూడి సత్రం పేరుతో నిర్మించారు. ఆ సత్రంలో విశాలమైన హాల్స్, 15 గదులు ఉండేవి. ఈ సత్రానికి ప్రత్తిపాడు మండలంలోని ఏలూరులో రెండు పంటలు పండే వందలాది ఎకరాల భూమి ఉండేది. ఈ భూములపై వచ్చే ఆదాయంతో బాటసారులకు అన్నదానం చేయాలని నిర్ణయించారు. వారి హయాంలోను, వారి తరువాత ధర్మకర్తగా వ్యవహరించిన శ్రీరాజా ఇనుగంటి రాజగోపాల వెంకటరామ చిన్నారావు హయాంలోను ఈ సత్రంలో బాటసారులకు భోజన వసతి, ఇతర సదుపాయాలు కల్పించి వారి ప్రశంసలు పొందారు. ఆ తరువాత సత్రం జీర్ణావస్థకు చేరింది. దాంతోబాటు భూములను కౌలు చేస్తున్న రైతులు 103 ఎకరాలపై రూ.మూడువేలు కౌలు చెల్లించేవారు. ఆ పరిస్థితుల్లో 2006 సంవత్సరంలో ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు ఈ సత్రాన్ని దేవస్థానానికి అనుబంధ సంస్థగా తమ అధీనంలోకి తీసుకున్నారు. సత్రం ఆస్తుల పరిరక్షణతో బాటు 103.62 ఎకరాల భూములపై వస్తున్న రూ.మూడువేలు కౌలును 2017 లో రూ.16.70 లక్షలకు వేలం ద్వారా పెంచారు. ఆ తరువాత ఈ కౌలు రూ.25 లక్షలకు పెరిగింది. శిథిలావస్థకు చేరిన సత్రాన్ని పడగొట్టి దాని స్థానంలో కస్తూరి సదన్ పేరుతో ఎనిమిది గదుల సత్రం నిర్మించారు. వాటిలో రెండు గదులు ఏసీ చేయించారు. కొత్త సత్రం వెనుక గల మరో భవనంలో గల నాలుగు గదులకు మరమ్మతు చేయించారు. ఇప్పుడు ఈ సత్రంలోని 12 గదులను భక్తులకు అద్దెకిస్తున్నారు. సత్రం ముందు గల స్థలాన్ని వివాహాలకు, ఇతర శుభకార్యాలకు అద్దెకిస్తున్నారు.

జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా ప్రారంభం



ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులతో జేసీ ప్రవీణ్ ఆదిత్య

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలను జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. బ్యాడ్మింటన్ విభాగంలో నిర్వహించిన పోటీలకు జిల్లాలోని 8 నియోజకవర్గాల నుంచి పురుషులు 12, మహిళలు 16 మంది పాల్గొన్నారు. పురుషుల విభాగంలో కాకినాడ సిటీ నియోజకవర్గం జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో తుని, మూడవ స్థానాన్ని పిఠాపురం జట్లు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో కాకినాడ రూరల్ ప్రథమ, కాకినాడ సిటీ ద్వితీయ, పిఠాపురం తృతీయ స్థానాలను సాధించాయని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రిభామిరెడ్డి, రిటైర్డ్ పీడీ కృష్ణమూర్తి, డీఎస్ఏ కోచ్‌లు సమీర్, చిన్నారి పాల్గొన్నారు.

4న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఈనెల 3వ తేదీన జరగాల్సిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీల సమావేశాలు అనివార్య కారణాల వల్ల ఈ నెల 4వ తేదీకి వాయిదా వేశామని జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సమావేశాలు ఆరోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశపు మందిరంలో జరుగుతాయని సీఈవో రమణారెడ్డి తెలిపారు.

కాకినాడ పార్లమెంటు కో ఆర్డినేటర్‌గా సునీల్



చలమలశెట్టి సునీల్

సాక్షిప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా చలమలశెట్టి సునీల్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఈ మేరకు బుధవారం విడుదల చేసిన నియోజకవర్గాల సమన్వయకర్తల ఐదో జాబితాలో సునీల్‌ను కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. మొదటి నుంచి కాకినాడ లోక్‌సభ స్థానాన్ని కాపు సామాజిక వర్గానికే కేటాయిస్తూ వస్తున్నారు. అదే సామాజికవర్గానికి చెందిన సునీల్ గతంలో వైఎస్సార్ సీపీ తరఫున కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేశారు. కాకినాడతో పాటు మెట్ట ప్రాంతంలోని జగ్గంపేట, ప్రత్తిపాడు తదితర నియోజకవర్గాల్లో బంధుత్వాలు కలిగిన సునీల్‌కు అక్కడి నాయకులతో సన్నిహిత సంబంధాలు, విస్తృతమైన పరిచయాలున్నాయి. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ అధిష్టానం సునీల్‌ను కాకినాడ పార్లమెంటు సమన్వయకర్తగా నియమించింది. అధిష్టానం పార్లమెంటు సమన్వయకర్తగా ప్రకటించడంతో మంచి ముహూర్తం చూసుకుని త్వరలో కాకినాడ రానున్నట్టు సునీల్ 'సాక్షి'కి తెలియచేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీ

62 మండలాల నుంచి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ



కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్–2 పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 62 మంది తహసీల్దార్లను, కలెక్టరేట్లలో వివిధ సెక్షన్లలో తహసీల్దార్ కేడర్‌లో వివిధ సెక్షన్లకు సూపరింటెండెంట్లుగా పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీలు చేస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన తహసీల్దార్లను పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా తదితర జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరి స్థానాల్లో ఇతర జిల్లాల నుంచి తహసీల్దార్లను నియమించింది. కాకినాడ కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్లలో సూపరింటెండెంట్లుగా పని చేస్తున్న సూర్యప్రభ, ఏవీ శాస్త్రి ఏలూరు జిల్లాకు, కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న సీహెచ్ వెంకటలక్ష్మి కృష్ణా జిల్లాకు, జి.వరహాలయ్య, కాకినాడ రూరల్ తహసీల్దార్ వీఎస్‌వీవీకేవీఆర్ మురార్జీ, తాళ్లరేవు తహసీల్దార్ ఎస్.పోతురాజు, సామర్లకోట తహసీల్దార్ ఎస్ఐఎస్ కుమారి, పెదపూడి తహసీల్దార్ టి సుభాష్, పిఠాపురం తహసీల్దార్ పి.త్రినాథరావు, గొల్లప్రోలు తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, యు.కొత్తపల్లి తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న కె.చంద్రశేఖరరెడ్డి, పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్రలు ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే కిర్లంపూడి తహసీల్దార్ కేఈ మాధవరావు, గండేపల్లి తహసీల్దార్ కేవీవీ సూర్యనారాయణ, కోటనందూరు తహసీల్దార్ కె.రఘురామయ్య, మారేడుమిల్లి తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, దేవీపట్నం తహసీల్దార్ కె.సత్యనారాయణ, కూనవరం తహసీల్దార్ కె.అనసూయ, చింతూరు తహసీల్దార్ కె.సుబ్బారావు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ రాజమహేంద్రవరంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డబ్ల్యూ ఐ రమణిలను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. తుని తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎల్.శివకుమార్‌ను, అడ్డతీగల తహసీల్దార్ ఎ.తాతారావును, రంపచోడవరం తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న ఎం.సావిత్రిని, వై.రామవరం తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, రాజవొమ్మంగి తహసీల్దార్ వైవీఎస్ ఆచారిని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి బదిలీ చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ వి.సుస్వాగతం, ఆర్డీవో కార్యాలయం కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్ డి.సుగుణ, రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ పి.చిన్నారావు, కడియం తహసీల్దార్ ఎం.సుజాత, అనపర్తి తహసీల్దార్ వై.సరస్వతిని, రంగంపేట తహసీల్దార్ వి.అమ్మాజీలను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు. బిక్కవోలు తహసీల్దార్ కె.పోసిబాబు, గోకవరం తహసీల్దార్ కె రాజ్యలక్ష్మి, కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో డీఏఓగా పని చేస్తున్న డి ఏసుబాబు ఏలూరు జిల్లాకు, కోరుకొండ తహసీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావు భీమవరానికి బదిలీ అయ్యారు. అదే విధంగా అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, కొత్తపేట తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, పి.గన్నవరం తహసీల్దార్ జీఆర్ ఠాగూర్, ఐ.పోలవరం తహసీల్దార్ ఎల్ ఝాన్సీలక్ష్మీకుమారి, మలికిపురం తహసీల్దార్ వీవీఐ నరసింహారావు, మామిడికుదురు తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, మండపేట తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, రాయవరం తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, కపిలేశ్వరపురం తహసీల్దార్ కె.సూర్యరావు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ముమ్మిడివరం తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ వై.రాంబాబు, రాజోలు తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఉప్పలగుప్తం తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఆలమూరు తహసీల్దార్ ఐపీ శెట్టి, అల్లవరం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న బీఎస్ఆర్ భాస్కర్‌ను, డీఏవో బీబీవీ మురళీకృష్ణను భీమవరానికి, రావులపాలెం తహసీల్దార్ మృత్యుంజయరావును ఏలూరుకు బదిలీ చేశారు.

క్లుప్తంగా

తాచుపాముకు దాహం



మొగలికుదురులో నీరు తాగుతున్న పాము

మామిడికుదురు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని గుబ్బల పద్మావతి ఇంటి అరుగుపై బుధవారం ఓ తాచుపాము బుసలు కొట్టింది. దీంతో బయపడిన పద్మావతి కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న స్నేక్ క్యాచర్ జాన దుర్గారావును సంఘటనా స్థలానికి రప్పించారు. అతడు వచ్చి పామును పట్టుకున్నాడు. దానికి స్టీలు గ్లాసుతో మంచి నీరు తాగించాడు. ఆరడుగుల పొడవున్న పామును డబ్బాలో బంధించి దూర ప్రాంతంలో విడిచి పెట్టాడు.

రత్నగిరిపై భక్తులకు నీడ వసతి



షెడ్డు నిర్మాణానికి కొలతలు తీయిస్తున్న ఈఈ నర్సింహారెడ్డి, డీఈ రాంబాబు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పశ్చిమ రాజ గోపురం ఎదురుగా 60 గదుల వీఐపీ సత్రం స్థలంలో భక్తులకు నీడ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వంద అడుగుల పొడవు, 80 అడుగుల వెడల్పున 'టెన్సైల్ రూఫ్ షెడ్' నిర్మాణానికి బుధవారం సన్నాహాలు ప్రారంభించారు. ఇక్కడ భక్తులకు నీడ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జనవరి 20న 'సాక్షి' దినపత్రికలో 'రత్నగిరిపై హాట్ పాట్లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఈఓ కె.రామచంద్రమోహన్ స్పందించారు. లారస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ప్రతినిధులతో దేవస్థానం ఈఈ నర్సింహారెడ్డి మాట్లాడి రూ.1.99 కోట్లతో గ్యాలోరిమ్ రూఫ్ షెడ్ స్థానంలో టెన్సైల్ రూఫ్ షెడ్ నిర్మాణం చేసేందుకు ఒప్పించారు. ఈ మేరకు ఈఈ నర్సింహారెడ్డి, డీఈ రాంబాబు ఇతర అధికారులు షెడ్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఎండలు ముదరకుండా వెంటనే పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు.

తోడుగా నిలిచిన ఆసరా



నా ఇంటి వద్ద కొబ్బరి పీచు యూనిట్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాను. వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతలుగా ఇంత వరకూ రూ.71,816 వచ్చింది. ఆ డబ్బులను పీచు పరిశ్రమలో పెట్టుబడిగా పెట్టాను. ఈ యూనిట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని కుటుంబ పోషణకు ఉపయోగించుకుంటున్నాను. గతంలో అప్పు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి జగన్ చలువతో ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. నాకు ఆసరా పథకం తోడుగా నిలిచింది.

– యాండ్ర వెంకటరమణ, మొగలికుదురు (జగ్గన్నపేట), మామిడికుదురు మండలం

వై.యస్.ఆర్. ఆసరా — పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు బాసట

ఆర్థికంగా అండ



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జగన్ డ్వాక్రా మహిళలకు సాయం చేశారు. వైఎస్సార్ ఆసరా పథకంలో మా కుటుంబం ఆర్థికంగా ఎంతో ప్రయోజనం పొందింది. విడతకు రూ.18 వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.72 వేలు నా బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయి. డ్వాక్రా రుణంతో మా అబ్బాయి వ్యాపారం చేసుకున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాం. జగనే మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నాను.

– నల్లమిల్లి విజయమణి, కరుణ మహిళా శక్తి సంఘం సభ్యురాలు, రావులపాలెం

శ్రద్ధ చూపితే మార్కుల యోగమే..

- ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం
- ఈనెల 5 నుంచి 20 వరకూ ఒకేషనల్, 11 నుంచి 20 వరకూ సైన్స్ విద్యార్థులకు నిర్వహణ



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అత్యంత కీలకం. ఇక్కడ సాధించే మార్కులే పైచదువులకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ మార్కులు ఎంతో ప్రాధాన్యమైనవి. ఆసక్తి చూపితే ప్రతి ప్రాక్టికల్‌లో 30కి 30 మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రయోగ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎంపీసీ విద్యార్థులు 6,127 మంది, బైపీసీ విద్యార్థులు 1,719 మంది, ఒకేషనల్ విద్యార్థులు (రెండేళ్లు కలిపి) 4,934 మంది ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్‌లో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించడంపై నిపుణులు పలు సలహాలు ఇచ్చారు.

ప్రయోగ పరీక్షల షెడ్యూల్

జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయి. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు 30 మార్కుల వంతున 60 మార్కులు, బైపీసీ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టుల్లో 30 మార్కుల వంతున 120 మార్కులు కేటాయిస్తారు. ఈ నెల 5 నుంచి 20 వరకూ ఒకేషనల్ విద్యార్థులకు, ఈ నెల 11 నుంచి 20 వరకూ ఇంటర్ సెకండియర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, ఈ నెల మూడున ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు మాత్రమే రాయాలి. వీటిలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి.

భాగాల గుర్తింపుతోనే మార్కులు



జంతుశాస్త్ర ప్రయోగ పరీక్షలో మూడు ప్రశ్నలుంటాయి. ఒకటవ ప్రశ్నగా చార్ట్‌ను డిస్‌ప్లే చేస్తారు. టైటిల్ చెప్పి పటం గీసి భాగాలను గుర్తించాలి. పటం అందంగా ఉండాలి. వీటికి ఆరు మార్కులు. రెండవ ప్రశ్నగా ఫిజియాలజీ ప్రయోగం ఇస్తారు. ఈ ప్రశ్నకు మూలసూత్రం, ప్రయోగ విధానం, ఫలితం తప్పనిసరిగా రాయాలి. తప్పనిసరిగా సైడ్ హెడ్డింగ్స్ పెట్టి, సంబంధిత సమాచారం రాయాలి. వీటికి ఐదు మార్కులు. మూడవ ప్రశ్నలో స్లైడులు, స్పెసిమెన్స్ కలిపి ఏడు రకాల స్పాటర్స్ ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. అకశేరుకాలు, సకశేరుకాలకు సంబంధించిన స్లైడులు, స్పెసిమెన్లను గుర్తించడంలో ఒత్తిడికి లోనుకాకూడదు. వీటికి పద్నాలుగు మార్కులు. నాలుగో ప్రశ్న రికార్డు. దానికి ఐదు మార్కులు. జువాలజీ ప్రాక్టికల్స్‌లో 30 మార్కులు తెచ్చుకోవడం బాలా సులువు. అయితే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి. పరీక్షా సమయంలో ఒత్తిడి లేకుండా సున్నితంగా పరిశీలించాలి.

– నల్లమిల్లి సురేష్‌రెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావులపాలెం.

మంచి మార్కులు సాధించవచ్చు



భౌతిక శాస్త్రానికి మూడు గంటల సమయానికి 30 మార్కులు కేటాయిస్తారు. మొత్తంగా 20 ప్రయోగాల్లో ఆరు విభాగాల నుంచి 38 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి బ్యాచ్‌కు 12 ప్రశ్నల వంతున ఇస్తారు. ప్రయోగ సూత్రానికి రెండు మార్కులు, ప్రయోగ విధానానికి మూడు మార్కులు, పట్టికలు, పరిశీలనలు, గ్రాఫ్‌లకు ఎనిమిది, కాలిక్యులేషన్స్(గణన)కు నాలుగు, జాగ్రత్తలకు రెండు, ఫలితం, ప్రమాణాలకు రెండు మార్కులు, రికార్డులకు నాలుగు, వైవాకు ఐదు మొత్తంగా 30 మార్కులుంటాయి. లాగర్ థమ్స్ ఉపయోగిస్తూ కాలిక్యులేషన్స్ చేస్తే పూర్తి మార్కులు వస్తాయి. దానికి నాలుగు మార్కులు వస్తాయి. అన్ని ప్రయోగాలకు జాగ్రత్తలు తప్పనిసరిగా రాయాలి. అన్ని ప్రయోగ విలువలు ఒకే ప్రమాణ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలి. ప్రమాణాలు ప్రతి విలువకు ఉన్నాయో లేదో కచ్చితంగా చూసుకోవాలి. పట్టికల్లో ప్రమాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు ప్రయోగాలకు సర్క్యూట్ డయాగ్రామ్ (వలయచిత్రం) తప్పనిసరిగా వేయాలి.

– సత్తి ఆదిరెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండపేట

సూటిగా సమాధానాలు రాయాలి



వృక్షశాస్త్రం ప్రయోగ పరీక్ష 30 మార్కుల ప్రశ్న పత్రంలో ఐదు విభాగాలు ఉంటాయి. ఒకటో ప్రశ్నకు వక్ష వర్గీకరణ శాస్త్రంలో మూడు కుటుంబాల్లో ఒక కుటుంబం వస్తుంది. వర్ణన క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా రాయాలి. అడిగిన చిత్రపటాలు, లక్షణాలు, బాగా సాధన చేసి తప్పులు లేకుండా రాయాలి. ఇచ్చిన మొక్కను బట్టి పుష్పచిత్రం, సమీకరణం, కుటుంబం గుర్తింపు తప్పనిసరి. రెండో ప్రశ్న వక్ష అంతర్నిర్మాణ శాస్త్రం నుంచి వస్తుంది. ఇచ్చిన మెటీరియల్‌ను బట్టి చాలా శ్రద్ధగా, శుభ్రంగా చేయాలి. కవర్ స్లిప్‌ను ఫిక్స్ నీట్‌గా వేసి, శాఖ్రనీను ఎక్కువ కాకుండా చూడాలి. భాగాలు గుర్తించిన, సెక్టర్ పటం గీసి, గుర్తింపు రాయడం ముఖ్యం. మూడో ప్రశ్న వక్ష శరీర ధర్మశాస్త్రం (లైవ్ ప్రయోగాలు) లాటరీ పద్ధతిలో విద్యార్థికి వచ్చిన ప్రయోగానికి అనుగుణంగా పరికరాల అమరిక చేయాలి. ఉద్దేశం, సూత్రం, పరిశీలన, ఫలితం మాత్రమే రాయాలి. ఇవి చాలా సులభమైన ప్రశ్నలు. నాలుగో ప్రశ్నకు ఐదు మార్కులు పొందవచ్చు. స్పాటరు లేదా స్లైడును గుర్తించి దాని లక్షణాలు రాయాలి. రికార్డు, హెర్బేరియాలలో హెర్బేరియాను నీట్‌గా తయారు చేసి కవర్‌లో ఉంచి కవర్‌పై నంబరు వేయాలి.

– కె.శ్రీనివాసరావు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముమ్మిడివరం

ఫలితం తప్పనిసరి



కెమిస్ట్రీ ప్రాక్టికల్‌లో మూడు గంటల సమయం ఇస్తారు. ప్రాక్టికల్‌లో మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో లవణ విశ్లేషణ ఉంటుంది. లవణ విశ్లేషణలో భౌతిక పరీక్షలు చేసిన తర్వాత రసాయన పరీక్షలు చేసి, ఆనయాన్, కాటయాన్లను గుర్తించడం, వాటి నిర్ధారణ పరీక్షలు ముఖ్యమైనవి. చివరగా ఫలితం తప్పనిసరిగా రాయాలి. ఫలితానికి ఒక మార్కు ఉంటుంది. మొత్తంగా ఈ విభాగానికి పది మార్కులుంటాయి. రెండవ విభాగంలో ఘన పరిమాణాత్మక విశ్లేషణకు 8 మార్కులు. ప్రాక్టికల్ ప్రారంభమైన వెంటనే మొదటి పది నిమిషాల్లో ప్రయోగ విధానం రాయాలి. బ్యూరెట్ రీడింగులు, ఎటువంటి కొట్టివేతలు లేకుండా పట్టికలు రాసి, లెక్కింపు విధానం, ఫలితం రాయాలి. మూడో విభాగంలో ఏ నుంచి డీ వరకు ప్రశ్నల్లో ఒకటి మాత్రమే ఇస్తారు. ఈ విభాగానికి ఆరు మార్కులు. ఏ విభాగంలో కర్బన సమ్మేళనంలో ప్రమేయ సమూహాన్ని గుర్తించడం. బీ విభాగంలో కొల్లాయిడ్ ద్రావణాలను తయారు చేయడం. సీలో క్రొమటోగ్రఫీ ఉంటుంది. డీలో కార్బోహైడ్రేట్ చర్యలు, ప్రొటీన్ల చర్యలు ఉంటాయి. వైవా, ప్రాజెక్టు రికార్డు, జనరల్ రికార్డుకు రెండేసి మార్కుల వంతున ఆరు మార్కులుంటాయి.

– యాళ్ల లక్ష్మణరావు, రసాయనశాస్త్ర అధ్యాపకుడు, కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మలికిపురం మండలం

గోడి బాలుర గురుకులం విద్యార్థి అదృశ్యం



యశ్వంత్ కుమార్ (ఫైల్)

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోరుకొండ యశ్వంత కుమార్ (17) అదృశ్యమయ్యాడు. అల్లవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యశ్వంత్ కుమార్ బాలురు గురుకులంలో ఎంపీసీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజుల క్రితమే ఇంటికి వెళ్లి తిరిగి గురుకులానికి చేరుకున్నాడు. అయితే మంగళవారం ఉదయం 6 గంటల నుంచి యశ్వంత్ కుమార్ కనిపించడం లేదు. తోటి విద్యార్థులు, సిబ్బంది అతడి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తండ్రికి సమాచారం అందించారు. అలాగే గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం ఉదయం అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యశ్వంత్ కుమార్ బాగా చదువుతాడని, మొదటి సంవత్సరంలోని అన్ని సబ్జెక్టులు పాసైయ్యాడని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎస్సై హరీష్ కుమార్ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేరెంట్స్ కమిటీల పదవీ కాలం పొడిగింపు



రాయవరం: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఉన్న 1,580 పాఠశాలల్లో ఏర్పాటు పేరెంట్స్ కమిటీల పదవీ కాలాన్ని ఏప్రిల్ 24 వరకూ (ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేవరకూ) పొడిగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఆ మహత్తర కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేస్తూ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేశారు. 2021 సెప్టెంబర్ 22న పాఠశాలల్లో ఈ కమిటీలను రెండేళ్ల కాలానికి నియమించారు. దానికి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21తో కమిటీల కాలపరిమితి ముగియగా, ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించింది. ఈ కమిటీలను ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే వరకూ కొనసాగించనున్నారు. వాస్తవానికి పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల పదవీ కాలం రెండేళ్లు. కమిటీ సభ్యుల్లో వారి పిల్లల చదువు రెండేళ్ల లోపు పూర్తయినా, లేదా పిల్లలు మధ్యలో బడి వదిలి ఇతర పాఠశాలలకు వదిలి వెళ్లి పోయినా వారు కమిటీలో పదవిని కోల్పోతారు. పాఠశాలల్లో నిర్వహించే అభివృద్ధి పనులకు సంబంధించి, ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి పేరెంట్స్ కమిటీల ఆమోదం అవసరమైన నేపథ్యంలో పదవీకాలం పొడిగించారు.

రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ నిర్మలా కుమారి, పీఈటీ సాధన

తుని: రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం బాలికలు బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.నిర్మలాకుమారి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఎస్‌సీహెచ్ ఉన్నత పాఠశాలలో జనవరి 28 నుంచి 30 వరకూ 67వ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయన్నారు. అండర్ – 17 విభాగంలో ఎ.అనిల (9వ తరగతి) రెండు, వై.జ్యోతి రెండు, బి.గీతిక రెండు బంగారు పతకాలను సాధించారన్నారు. అండర్–14 విభాగంలో సీహెచ్.అర్చన (7వ తరగతి) రెండు రజత పతకాలను గెలుచుకుందన్నారు. రోప్ స్కిప్పింగ్ డబుల్ టచ్‌లో ద్వితీయ స్థానం, 4'' రిలేలో రెండు రజత పతకాలు సాధించారన్నారు.

బాధితుడే ప్రధాన సూత్రధారి

- బీమా సొమ్ము కోసమే పన్నాగం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిశోర్ కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ కిశోర్ కుమార్

రంగంపేట: మృతదేహం దహనం కేసులో బాధితుడిగా భావించిన కేతమల్ల వెంకటేశ్వరరావే అసలు సూత్రధారి అని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ కె.కిశోర్ కుమార్ తెలిపారు. రంగంపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. రంగంపేట మండలం పాత వీరంపాలెం గ్రామానికి చెందిన కేతమల్ల వెంకటేశ్వరరావు రూ.40 లక్షల ఇన్సూరెన్స్ సొమ్ముకోసం తాను చనిపోయినట్టుగా చిత్రీకరించి చట్టాన్ని, సమాజాన్ని నమ్మించేందుకు చేసిన ప్రయత్నం పోలీసుల విచారణలో బెడిసికొట్టింది. అతడు రెండు నెలల క్రితం ఎల్‌ఐసీ పాలసీ తీసుకున్నాడు. దాని ప్రకారం సాధారణ మృతికి రూ. 20 లక్షలు, యాక్సిడెంటల్ మరణం అయితే రూ.40 లక్షలు వస్తాయని భావించాడు. దీంతో చనిపోయిన వ్యక్తి శవాన్ని తీసుకువచ్చి తాను విద్యుత్తు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరించాలని భావించాడు. ఈ పథకం అమలు చేయడం కోసం తన స్నేహితుడైన హుకుంపేట గ్రామానికి చెందిన వందే శ్రీనుకి రూ.10 వేలు ఇచ్చి ఏదైనా శవాన్ని తీసుకురమ్మని పురమాయించాడు. దీంతో వందే శ్రీను శ్మశానాల దగ్గర గోతులు తీసుకునే హుకుంపేటకు చెందిన తలారి సుబ్బారావు, మోరంపూడికి చెందిన చీర చిన్నిని సంప్రదించాడు. వారు ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి పాత బొమ్మూరు శ్మశాన వాటిక నుంచి శవాన్ని దొంగిలించారు. వందే శ్రీనుకు చెందిన కారులో పాత వీరంపాలెం తీసుకువచ్చి కేతమల్ల గంగారావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడేశారు. అనంతరం కేతమల్ల వెంకటేశ్వరరావుతో పాటు వందే శ్రీను, చీర చిన్ని, తలారి సుబ్బారావు ఆ శవంపై పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ఈ విషయంలో పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో నలుగురినీ మంగళవారం అరెస్టు చేశారు. నిందితులు ఉపయోగించిన కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. కేసును ఛేదించిన అనపర్తి సీఐ శివ గణేష్, రంగంపేట ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

నేటి నుంచి బ్యారేజీపై రాకపోకలు నిలిపివేత



కాటన్ బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ రోడ్డు మరమ్మతులు మరో పది రోజుల్లో పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో బ్యారేజీపై వాహనాల రాకపోకలను గురువారం నుంచి ఈనెల 10వ తేదీ వరకూ పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇప్పటికే బ్యారేజీ రోడ్డు పైపొరను తొలగించారు. రూ.2 కోట్లతో బ్యారేజీ పరిధిలోని 6.8 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయి. పూర్తి నాణ్యత ప్రమాణాలతో వాటిని చేపట్టాలని కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలన్నారు. కాగా. నిత్యం వేల మంది రాకపోకలు సాగించే కాటన్ బ్యారేజీ రోడ్డు మరమ్మతులు చేస్తుండడంపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రగ్బీ పోటీలకు 24 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పిఠాపురంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సమారు 85 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది బాలురు, 12 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరందరూ శుక్రవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్ తెలిపారు. విశేష ప్రతిభ చూపిన క్రీడాకారులను అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.నాగలింగేశ్వరరావు, కె.పద్మనాభం, వంశీ, నవీన్, సతీష్, ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి వై.తాతబ్బాయి, పీడీలు శేషుకుమారి, సునీల్ దేశాయ్, సతీష్ భార్గవ్, కోచ్ పి.లక్ష్మణరావు అభినందించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారులు



జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

పిఠాపురం: బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి, కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ పిఠాపురంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాలుర నేషనల్ బాస్కెట్‌బాల్ కోచింగ్ శిబిరంలో విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. వీరందరూ ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జూనియర్ బాలుర బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్ర సెలక్షన్ కమిటీ చైర్మన్ నడింపల్లి అప్పలరాజు, రాష్ట్ర కోచ్ ఎంఎ రుద్ర, అసిస్టెంట్ కోచ్ కొత్తెం సుందర కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొజ్జా దొరబాబు, ఆగంటి ప్రభాకరరావు, మతం లోవరాజు, పెదపాటి నాగేశ్వరరావు అసోసియేషన్ తరఫున దుస్తులు పంపిణీ చేశారు.

4న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద గల ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఈనెల 4న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ కుమారరామ భీమేశ్వర ఎడ్ల పరుగు పోటీల కమిటీ నాయకులు రామకృష్ణ, కాటూరి జానకిరామ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగే పోటీలను ఉదయం ఏడు గంటలకు చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత గుణ్ణం చంద్రమౌళి ప్రారంభిస్తారన్నారు. సీనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరున్నర, జూనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటర్ దూరం వెళ్లి రావాల్సి ఉంటుందన్నారు. తక్కువ సమయంలో తిరిగి వచ్చిన ఎడ్లకు రెండు విభాగాలలోను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఎడ్ల బండిపై ఇద్దరు మాత్రమే ఉండాలని తెలిపారు.